# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 05-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యానికి ధ్యానం ఒక ముఖ్యమైన సాధనమని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

❖ ఈస్టర్ పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

❖ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ లో భద్రతను బలోపేతం చేయడానికి సుమారు 1,500 ఏఐ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

❖ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) భాగంగా బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యానికి ధ్యానం ఒక ముఖ్యమైన సాధనమని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆఫ్ మెడిటేషన్ లీడర్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ధ్యానం ఒత్తిడిని తగ్గించడమే కాకుండా.. ఏకాగ్రతను మెరుగుపరుస్తుందన్నారు. భావోద్వేగాలను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తిని పెంచుతూ.. జీవితం పట్ల ప్రశాంతమైన, స్థిరమైన దృక్పథాన్ని పెంపొందించడంలో ధ్యానం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అర్థవంతమైన, దృఢమైన ఫలితాలను సాధించాలంటే.. మనస్సు, హృదయం మధ్య సమన్వయం ఎంతో అవసరమని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈస్టర్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ఈరోజు జరుపుకుంటున్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సామాజిక మాధ్యమం ఎక్స్

వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థానానికి గుర్తుగా జరుపుకునే ఈ పవిత్ర దినం.. సత్యం, ప్రేమ, కరుణ, త్యాగం, క్షమాగుణం వంటి విలువలను అలవర్చుకునేలా ప్రజలకు దారి చూపుతుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ పవిత్రమైన సందర్భం సత్యాన్ని కాపాడటానికి, వినమ్రతను అలవర్చుకోవడానికి, అందరి శ్రేయస్సు కోసం కలిసి పని చేయడానికి ప్రజలకు స్ఫూర్తినిస్తుందని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఈ పవిత్ర దినం ఆశను, పునరుత్తేజాన్ని చాటిచెబుతుందని, ఈ పండుగ అందరి జీవితాల్లో శాంతి, సంతోషం, వెలుగులను నింపుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పూర్వ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. బాబూ జగ్జీవన్ రామ్ తన జీవితాన్ని సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంకితం చేశారని సామాజిక మాధ్యమం వేదికగా ప్రధాని పేర్కొన్నారు. దేశానికి ఆయన అందించిన వెలకట్టలేని సహకారం ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని నరేంద్ర మోదీ కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరుకుంది. ఈ నెల 23, 29వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరుగనుంది. బీజేపీ, టీఎంసీ, కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రచారంలో భాగంగా కూచ్ బెహార్‌లో ఈరోజు జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ప్రధాని పేర్కొంటూ…

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలోని ప్రధాన ఓడరేవులు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 915 మిలియన్ టన్నుల సరుకు రవాణా నిర్వహించి రికార్డు సృష్టించాయి. వార్షిక లక్ష్యాన్ని అధిగమించడమే కాకుండా.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేశాయి. ఈ విజయం నౌకాయాన రంగం బలమైన పునరుద్ధరణను, పెరిగిన సామర్థ్యాన్ని, స్థిరమైన వృద్ధిని ప్రతిబింబిస్తుందని కేంద్ర నౌకాయాన, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాన ఓడరేవుల ద్వారా జరిగిన ఈ రికార్డు స్థాయి సరుకు రవాణా.. భారత నౌకాయాన రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని ఆ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. పెరుగుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా ప్రపంచ స్థాయి పోర్టు మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జనవిశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు – 2026 దేశంలో `ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్` (వ్యాపార నిర్వహణ సౌలభ్యం) `ఈజ్ ఆఫ్ లివింగ్` (జీవన సౌలభ్యం) మెరుగుపరచడంలో ఒక ముఖ్యమైన అడుగు అని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు చెందిన లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్ అదనపు కార్యదర్శి కె.వి. కుమార్ తెలిపారు. న్యూఢిల్లీలో ఆకాశవాణితో ఈరోజు ఆయన మాట్లాడారు. చిన్న చిన్న తప్పులను నేరాలుగా పరిగణించకుండా, వాటి స్థానంలో జరిమానాలను ప్రవేశపెట్టడం ద్వారా సుమారు వెయ్యికి పైగా నేరాలను హేతుబద్ధీకరించారని కె.వి. కుమార్ తెలియజేస్తూ…

(వాయిస్ 26 సెకన్లు)

==============================

దేశ రాజధాని న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ లో భద్రతను బలోపేతం చేయడానికి, అన్ని ప్రాంతాలను పర్యవేక్షించడానికి సుమారు 1,500 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు వెల్లడించారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. స్టేషన్‌లోని ప్రతి ఉద్యోగికి , అమ్మకందారులకు సరైన గుర్తింపు కోసం గుర్తింపు కార్డు, ప్రత్యేక జాకెట్‌ను అందజేస్తామని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం స్టేషన్‌ను "భారత్ టాక్సీ" సేవలతో అనుసంధానిస్తామని స్పష్టం చేశారు.

==============================

కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఎర్నాకుళం జిల్లాలోని కున్నతునాడ్ నియోజకవర్గంలో ఈరోజు జరిగిన బహిరంగ సభలో బీజేపీ సీనియర్ నేత అమిత్ షా ప్రసంగించారు. ఎన్నికలు కేవలం ప్రభుత్వం మార్పు కోసం మాత్రమే కాదని.. రాష్ట్ర భవిష్యత్‌ను మెరుగుపరచడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అందరికీ న్యాయం ఎన్డీయే ప్రభుత్వ నినాదమని అమిత్ షా స్పష్టం చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) భాగంగా బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నైసూపర్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు నష్టపోయి 98 పరుగులు చేసింది. అంతకు ముందు హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పై 5 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్ విజయం సాధించింది.

==============================

ప్రయాణికుల సౌకర్యం, భద్రత, ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా `అమృత్ భారత్` రైళ్ల కొత్త కోచ్‌లను రూపొందించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో అత్యాధునిక `అమృత్ భారత్` రైళ్ల నమూనా కోచ్‌లను స్వయంగా తనిఖీ చేశారని పేర్కొంది. అన్ని వర్గాల ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, మెరుగైన ప్రయాణ వసతులను కల్పించాలనే భారతీయ రైల్వే నిరంతర కృషిలో భాగంగా ఈ ఆధునీకరణ ప్రక్రియను చేపట్టినట్లు వెల్లడించింది. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేశామని, ఈ కోచ్‌లలో ఉపయోగించిన మెటీరియల్ అంతా "హజార్డ్ లెవల్-3" ఫైర్ సేఫ్టీ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని, ఇవి అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా తట్టుకోగలవని రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వివరించింది.

==============================

==============================